సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 17 । జూన్ । 2024



త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకోనున్నారు. మసీదులు, ఈద్గాలను ముస్తాబు చేశారు. 8లో



ఆదివాసీ యువతకు స్మగ్లర్ల వల!

అమాయకత్వం, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని స్మగ్లర్లు ఆదివాసీ యువకులను గంజాయి దందాలోకి లాగుతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

36^{o} / 27^{o}

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతంగా మారుతుంది.

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన కలెక్టర్ జితేష్



డిప్యూటీ సీఎం భట్టికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా, జిల్లా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం సూచించారు.

బక్రీద్ సంతోషంగా జరుపుకోవాలి : ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రజలందరూ మత సామరస్యాన్ని కాపాడుతూ సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మసీదులు, దర్గాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 రోజులుగా 7 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఆవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు. అలా ఎవరైనా చేస్తే డయల్–100కు చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ ఎస్ఈ భీకంసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ సెలవు అయినప్పటికీ విద్యుత్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి, ప్రజావాణి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఏఈఈ, ఏడీఈ, డీఈ, ఈఆర్వో కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఎస్ఈ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలంటౌన్: ఐటీడీఏలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా సెలవు కావడంతో అధికారులు అందుబాటులో ఉండరని, దీంతో రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో ఉద్యోగ అవకాశాలు

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 155 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 18 తేదీ నుంచి 25 తేదీ వరకు దరఖాస్తు గడువు విధించారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనా అధికారి వేల్పుల విజేత ఆదివారం వివరాలు వెల్లడించారు. బుక్ టేరర్ పోస్టులు 4, డేటా ఎంట్రీ ఆపరేటర్, టైపిస్ట్ పోస్టులు 7, టెక్నీషియన్ 6, కోడింగ్ క్లర్క్స్ 4, డ్రైవర్ 4, ఎలక్ట్రీషియన్ 5, ప్లంబర్ 2, మాలి సబ్‌స్టాఫ్, మనిఫోల్డ్ సూపర్‌వైజర్ 3, టైలర్ 4, టెలిఫోన్ ఆపరేటర్ 8, థియేటర్ అసిస్టెంట్ 10, వాన్ డ్రైవర్ 2, కార్పెంటర్ 1, అటెండెంట్ 5, బార్బర్ 6, దఫ్తరి, సబ్ ఆర్డినేట్ స్టాఫ్ 2, డార్క్‌రూమ్ అసిస్టెంట్, డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజిస్ట్ 1, దోబి 20, ల్యాబ్ అటెండెంట్ 20, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ 6, ఆఫీస్ సబార్డినేట్ 11, రికార్డు క్లర్క్, రికార్డు అసిస్టెంట్, స్టోర్ కీపర్ 10, వార్డ్ బాయ్ 14 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఐడీఓసీలోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. నిరుద్యోగులు దళారులను నమ్మి మోసపోవొద్దని, అభ్యర్థుల ఎంపిక ప్రతిభ ఆధారంగానే జరుగుతుందని పేర్కొన్నారు.

20 నుంచి ఒలింపిక్ డే రన్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా ఈ నెల 20న అశ్వారావుపేటలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి భద్రాచలం, ఇల్లెందు మీదుగా 23వ తేదీకి కొత్తగూడెం చేరుకుంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఒలింపిక్ డే రన్, జ్యోతి ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

ప్రైవేటులో ఫీజులుం!

ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాశాఖ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం వంటివి తమ వద్దనే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అధికభారం మోపుతున్నాయి. దీనికితోడు ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఫీజులు పెంచేశాయి. తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటూ సంస్థలను, బ్రాంచ్‌లను విస్తరింపజేసుకుంటున్నాయి.

– కొత్తగూడెంఅర్బన్



విద్యాశాఖ ఆదేశాలు బేఖాతర్

- ప్రైవేటు పాఠశాలల్లో కానరాని ఫీజు పట్టికలు
- యథేచ్ఛగా పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు
- యాజమాన్యాల అధిక వసూళ్లతో తల్లిదండ్రులపై ఆర్థికభారం
- రెన్యూవల్, కొత్త స్కూళ్ల సమాచారంపై అధికారుల గోప్యత!

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మా వద్దే కొనాలి

జిల్లాలోని ఏ ప్రైవేటు పాఠశాలలో కూడా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు విక్రయించొద్దని విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించి, పాఠశాలల ఎదుట, సమీప ప్రాంతాల్లో రహస్యంగా పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నారు. ఒకటో తరగతి విద్యార్థికి ఫీజులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం మొత్తం కలిపి కూడా రూ.50 వేల వరకు తల్లిదండ్రులకు ఖర్చు వస్తోంది. ఇక పైతరగతులకు వెళ్లే కొద్దీ ఖర్చు ఇంకా పెరుగుతోంది.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అధునాతన సౌకర్యాలు, మెరుగైన విద్యాబోధన అందిస్తున్నారు. అయినా ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు మరింత క్రమశిక్షణ, విద్యాబుద్ధులు ఎక్కువగా నేర్చుకునే అవకాశం ఉంటుందనే భావనతో తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. రూ. వేలల్లో ఫీజులు చెల్లిస్తున్నారు.

అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన

జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన చేపడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు అర్హులను తీసుకుని, వారి వివరాలు చూపుతూ ఎక్కువ మందిని క్వాలిఫైడ్ కాని టీచర్లతో స్కూళ్లను నడిపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

నిబంధనలు పాటించకపోయినా అనుమతులు

గత రెండేళ్లుగా జిల్లాలో ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరుగుతోంది. అయితే నిబంధనలు పాటించకపోయినా యథేచ్ఛగా విద్యాశాఖ నుంచి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. నూతన పాఠశాల ఏర్పాటు అనుమతికి తప్పనిసరిగా గ్రౌండ్, ఆహ్లాదకర వాతావరణం, తగినన్ని రూంలు, వెంటిలేషన్, ఆటంకాలు లేని ప్రాంతాలు కలిగి ఉండటం.. తదితర నిబంధనలు పాటించాలి. అవన్నీ పరిశీలించాకే విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలి. దీంతో పాటు ఇప్పటికే ఉన్న పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే, అన్ని సౌకర్యాలు ఉంటేనే రెన్యూవల్ చేయాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధనలు విద్యాధికారులు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. పాఠశాలల అనుమతులు, రెన్యూవల్ సమాచారంపై అధికారులు గోప్యత పాటించడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం విద్యాశాఖాధికారులు, సిబ్బంది ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో ఉండటంతో ప్రైవేటు స్కూళ్లలో తనిఖీలు చేయడం లేదని పేర్కొంటున్నారు. అదే అదనుగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం సైతం పాఠశాలల సమీపంలో అక్రమంగా విక్రయిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి యథేచ్ఛగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.

ఫీజు పట్టికలు ఏవి..?

జిల్లాలో 230కు పైగా ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రారంభం రోజు నుంచి పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద తరగతుల వారీగా ఫీజుల వివరాలను పట్టికలో పొందుపరచాలి. ఈ మేరకు ప్రతి ఏటా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అవుతాయి. కాని ఏ ప్రైవేటు పాఠశాలలో కూడా ఫీజుల పట్టిక ఏర్పాటు చేయడంలేదు. వారికి నచ్చినంతా వసూళ్లు చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు కూడా ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప పాఠశాలలను పర్యవేక్షించడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు.

పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తే చర్యలు



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. దీంతోపాటు ఫీజుల పట్టికలను కూడా పాఠశాలల్లో ఏర్పాటు చేయాలి. నిబంధనల ప్రకారం కాకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు ఎక్కువగా వసూళ్లు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

–ఎం.వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాధికారి

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ జితేష్

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ బాధ్యతలు కూడా..



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన జితేష్ వి.పాటిల్ ఆదివారం ఉదయం 10.15 గంటలకు కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ప్రియాంక ఆల పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, కలెక్టరేట్ ఏఓ గన్యా, వివిధ శాఖల జిల్లా అధికారులు పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తన చాంబర్‌లో కలెక్టర్ పాటిల్ జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు, లక్ష్యాల మేరకు అందరినీ సమన్వయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛాలు తేవొద్దు

తనను కలిసేందుకు వచ్చిన వాళ్లు పుష్పగుచ్ఛాలు, బొకేలు తేవొద్దని నూతన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. అవసరమైతే పుస్తకాలు తీసుకురావాలని, పేద విద్యార్థులకు ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు.

గిరిజన సమస్యలపై దృష్టి పెట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సమస్యలపై దృష్టి సారించి, వారి అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓగా ఆయన బాధ్యతలు చేపట్టి, అనంతరం అధికారులతో మాట్లాడారు. ఏజెన్సీలో విద్యా, వైద్యంపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ఐటీడీఏలో పనిచేసే ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు.

రామయ్య సేవలో..

భద్రాచలం: కొత్త కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన జితేష్ వి పాటిల్ శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాక భద్రాచలం వచ్చి రామాలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో పండితులు వేదాశీర్వచనం చేయగా ఈఓ రమాదేవి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. కాగా తొలుత దేవస్థానం అధికారులు, అర్చకులు కలెక్టర్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, ఏఈఓ భవానీ రామకృష్ణ, ఆర్డీఓ దామోదర్ రావు, అర్చకులు, పండితులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం అధికారులు, ఉద్యోగులు ఆయన్ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, అధికారులు డేవిడ్ రాజ్, మణెమ్మ, తానాజీ, సురేష్ బాబు, శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశ్వరరాజు, రమణయ్య, నరసింహారావు, హరికృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రోజే బాసటగా..

మానవత్వం చాటుకున్న కలెక్టర్



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న కలెక్టర్ పాటిల్

బూర్గంపాడు: బూర్గంపాడు మండలం సారపాక సమీపంలోని మణుగూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆటో, బైక్ ఢీ కొని ఆదివారం ప్రమాదం జరిగింది. దీంతో బైక్‌పై వస్తున్న ఓ యువకుడు, ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆటోలో వస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు గాయపడ్డారు. అదే సమయంలో నూతన కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తున్నారు. ప్రమాదాన్ని గమనించి తన వాహనం దిగి క్షతగాత్రులకు సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 రాకముందే ఇద్దరు క్షతగాత్రులను తన వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మరో ముగ్గురిని అంబులెన్స్‌లో వాహనంలోకి ఎక్కించి ఆస్పత్రికి పంపించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఫోన్‌లో ఆదేశించారు.

పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత

- 27 ఆస్పత్రుల్లో డాక్టర్ పోస్టులు ఖాళీ
- దరఖాస్తులు స్వీకరించినా నియామకం చేపట్టనివైనం



ఆళ్లపల్లి మండలంలోని కాచనపల్లిలో మూసి ఉన్న పల్లె దవాఖానా

కొత్తగూడెంరూరల్: జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. దీంతో ప్రజలకు వైద్య సేవలు అందడంలేదు. జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో 260 సబ్ సెంటర్లు ఉండగా, వాటిలో 153 కేంద్రాలను గత ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా మార్చింది. వీటిల్లో ఎంబీబీఎస్ లేదా ఆయుష్ వైద్యులను నియమించాలి. వీరిద్దరూ లేకపోతే బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తి చేసిన సిబ్బంది ఉండాలి. డాక్టర్లు లేనిసందర్భంలో నర్సింగ్ సిబ్బంది బాధితుల అనారోగ్య వివరాలను పీహెచ్‌సీ వైద్యులకు దృష్టికి తీసుకెళ్లి, వారి సలహా మేరకు వైద్య సేవలందించాలి. అవసరమైతే వారిని పీహెచ్‌సీ డాక్టర్ వద్దకు పంపించాలి. పల్లె దవాఖానాల్లో బీపీ, షుగర్ వంటి 14 రకాల పరీక్షలు కూడా చేస్తారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. వివిధ రకాల కేన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్య సేవలకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేయాల్సిఉంది. కాగా మిగిలిన సబ్ సెంటర్లను కూడా త్వరలో పల్లె దవాఖానాలు మార్చనున్నట్లు వైద్య శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

27 దవాఖానాల్లో డాక్టర్లు లేరు..

జిల్లాలో పల్లె దవాఖానాలు 153 ఉండగా, 27 ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాచనపల్లి, పరిగిగూడెం, వేదంత పురం, తుంగారం, దోసిలపల్లి, నాచారం, గట్టుగూడెం, పెంట్లం, అనంతారం, షీతపల్లి, కొమ్ముగూడెం, గంగారం, పంగలపల్లి, తిమ్మరావుపేట, భగత్‌సింగ్ నగర్, కమలాపురం, పగిడేరు, సుందరయ్య నగర్, ముత్యాలపేట, రాజీవ్‌నగర్ కాలనీ, లింగాలపల్లి, త్రీ ఇంక్లైన్, చాతకొండ, 24 పిట్, రంగబోయినగూడెం, సత్యనారాయణపురం, ఉల్వనూర్ తదితర పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత ఉంది. 27 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించగా 323 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ నియామక ప్రక్రియ పూర్తిచేయలేదు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఒకరోజు బ్యాడ్మింటన్ టోర్నీ నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ముగిసింది. ఉదయం జరిగిన కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్–13, 15, 17, 19, సీనియర్స్ పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్షుడు టి.వెంకట్రావు, కార్యదర్శి ఎస్.ఉప్పల్‌రెడ్డి, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవిమారుత్, పి.యుగంధర్, నల్లమోతు రఘు, కోశాధికారి చంద్రశేఖర్, శ్రీనివాస్, రామారావు తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే...

అండర్–13 బాలుర సింగిల్స్‌లో సత్యలా హర్ష, డి.దీక్షిత్, డబుల్స్ విభాగంలో డి.కార్తికేయ, దీక్షిత్–ఎల్.నిశాల్, కె.నిహాత్‌సాయి, బాలికల అండర్–13 సింగిల్స్‌లో కె.లాస్య, ఎం.చరితశ్రీ, డబుల్స్‌లో జె.బీమా, చరితశ్రీ– బి.హన్విక, జి.తుల్యాశ్రీ, అండర్–15 బాలుర సింగిల్స్‌లో వినయ్, అబ్దుస్ సమద్, బాలికల సింగిల్స్‌లో డి.రచన, జె.అన్విత, అండర్–15 బాలుర డబుల్స్‌లో ఎ.వినయ్, బి.విష్ణుతేజ–కె. విష్ణుతేజ.స్వపల్, బాలికల విభాగంలో వై.హన్సిత, జె.అవంతిక– జి.నిత్య సంతోషిని, పి.లాసిని, అండర్–11 బాలుర సింగిల్స్‌లో సత్యాల సాహిత్, రేంత్, బాలికలలో కె. లాస్య, జి.నిత్య సంతోషిని, బాలుర డబుల్స్‌లో బి.రేంత్, సాహిత్– వి. అశ్విన్ రాహిత్, అభిరాజు, బాలికల విభాగంలో లాస్య, సంధ్య– పిత్య, సియోనా, అండర్–17 బాలికల సింగిల్స్‌లో డి.రచన. పి.చద్విల సాయిని, అండర్–19 బాలుర డబుల్స్‌లో ఎం.విద్యాధర్, ఎ. విశ్వేశ్వర్– ఎస్. నిఖిల్, హరికృష్ణ, మహిళల సింగిల్స్‌లో వాసిరెడ్డి వి.వేదస్వి, సింగిల్స్‌లో ఎం.మమత, వాసిరెడ్డి వేదశ్రీ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

భద్రగిరిలో భక్తుల సందడి



స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ వేడుకకు హాజరైన జంటలు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో రామయ్య దర్శనానికి భక్తులు బారులుదీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించి.. క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణంలో అధికంగా 144 జంటలు పాల్గొన్నాయి.

రామయ్యకు పుష్పార్చన

రామయ్య స్వామికి తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆది వారం రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిట కిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు అమ్మవారికి విశేషపూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోనకల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలో మోటమర్రి, పెద్దబీరవల్లి, తూటికుంట్ల గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో మధిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందువరుసలో ఉంచుతామని హామీ ఇచ్చారు. మార్గమధ్యంలో భట్టికి మహిళలు, చిన్నారులు ఘన స్వాగతం పలకగా ఆయన కాన్వాయ్ దిగి వారితో ముచ్చటించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ సురేందర్, పీఆర్ ఏఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ వున్నం చందర్, ఎంపీడీఓ ఎల్.రాజు, జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, నాయకులు పైడిపల్లి కిషోర్, గాలి దుర్గారావు, కోటి, తూళ్లూరి లక్ష్మీనర్సయ్య, ఆళ్ల మోహన్‌రావు, ఉసికల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి..

మండలంలోని మోటమర్రిని ఎంపీటీసీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కొందరు ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో రాకపోకలు కొనసాగించలేకపోతున్నామని స్థానిక మహిళలు, సీపీఐ నాయకులు భట్టి విక్రమార్క ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ వైద్యులపై దాడులను నివారించాలని కోరుతూ తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బోయినపల్లి శ్రీనివాసరావు, బొమ్మినేని కొండలరావు, షేక్ హుసేన్ భట్టికి విన్నవించారు. గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స చేస్తున్నామని, తమ సేవలు నిలిపివేయాలని టీఎస్ఎంసీ హెచ్చరించడం బాధకరమని వాపోయారు.

క్లుప్తంగా

హెచ్ 142 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రామారావు


రామారావును సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్ 142) రాష్ట్ర అధ్యక్షుడిగా కే.వీ.రామారావు నియమితులయ్యారు. ఆదివారం స్థానిక కేటీపీఎస్ ఏ కాలనీలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ కె.వెంకటరెడ్డి ఎగురవేసి ఇటీవల మృతి చెందిన రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఖాజామొయినుద్దీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన గత 33ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేశామని, రానున్న రోజుల్లో మరింత నిబద్ధతతో ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఈనేపథ్యాన రామారావుకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఎస్.శ్రీనివాసాచారి, వెంకట్‌రెడ్డి, డి.సత్యరాజ్ స్టీవెన్, ఎస్.నాగిరెడ్డి, వి.కోటేశ్వరరావు, ఎం.అనిల్‌కుమార్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, ఎం.శివరాం, నాగభూషణం, ప్రసాద్, కోటేశ్వరరావు, శ్రీహరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ములకలపల్లి: తాత, మనవడిపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని ముత్యాలంపాడు గ్రామానికి చెందిన మడకం బొజ్జికి ముగ్గురు కొడుకులు వెంకటేశ్, రవి, శ్రీను ఉన్నారు. పెద్దకొడుకు వెంకటేశ్ పదేళ్ల క్రితం చనిపోగా.. వెంకటేశ్ కొడుకు ఉమేశ్ తాత వద్దనే ఉంటున్నారు. ఇదిలా ఉండగా బొజ్జికి చెందిన జామాయిల్ తోటను ఇద్దరు కొడుకులు ఆదివారం నరుకుతుండగా.. బొజ్జి, మనవడు ఉమేశ్ అడ్డుకున్నారు. తమకూ వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రవి, శ్రీను వీరిపై కర్రలతో దాడి చేయగా.. వారిద్దరికి గాయాలయ్యాయి. దీంతో బొజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైనర్‌పై అత్యాచారం చేసిన యువకుడిపై..

పాల్వంచరూరల్: మైనర్‌పై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలో ఓ గ్రామానికి చెందిన ఒంటరిగా ఇంట్లో ఉన్న 14 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన జి.ధరణికుమార్ శనివారం రాత్రి అత్యాచారం చేసి విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆ బాలిక రోధిస్తూ.. తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని చెప్పడంతో ఆదివారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నాగేశ్వరరావు మృతదేహం

దమ్మపేట: మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నల్ల కుంట గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన చిలకా నాగేశ్వరరావు(25) దమ్మపేట నుంచి గొల్లగూడెం గ్రామం వైపుకు తన ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంతో బైక్‌ను నడపడంతో నల్ల కుంట గ్రామ శివారులోని మూలమలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయం కాగా గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా.. వారు అక్కడకు చేరుకుని పరీక్షించి సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. అప్పటికే మృతి చెందినట్టుగా ధ్రువీకరించగా.. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో వ్యక్తి...

దమ్మపేట: పాముకాటుకు గురైన వ్యక్తి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నల్లకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నల్ల కుంట గ్రామానికి చెందిన సున్నం పరమేష్(63) శనివారం సాయంత్రం గ్రామ శివారులోని బహిర్భూమికి వెళ్లగా పాము కాటుకు గురయ్యాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబీకులు బాధితుడిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

త్యాగానికి ప్రతీక 'బక్రీద్'

- మానవతను వ్యాప్తి చేసేలా పండుగ
- ప్రత్యేకంగా నిలవనున్న హజ్ యాత్ర
- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు
- నేడు ఈదుజ్జుహా


ఇల్లెందురూరల్: నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలందరూ రంజాన్ పండుగ తరువాత అత్యంత ఇష్టంగా జరుపుకునే పండుగ బక్రీద్. మానవాళిలో ఆవహించి ఉన్న పశుత్వాన్ని నిర్మూలించడం.. దైవానికి ప్రీతికరం అని చెప్పడమే బక్రీద్ అంతరార్థం. దైవారాధన ప్రవక్త త్యాగనిరతిని గుర్తు చేసుకుంటూ అల్లాహ్ ప్రవక్తను, త్యాగాలకు ప్రతీకగా బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నేడు(సోమవారం) జరుపుకోనున్నారు. 'ఈదుల్ అజ్ హా'లేదా ఈదుజ్జుహా అనే పండుగను బక్రీద్ పేరిట జరుపుకునేందుకు జిల్లా వ్యాప్తంగా మసీదులు, ఈద్గాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

– కొత్తగూడెంటౌన్/ఇల్లెందురూరల్/జూలూరుపాడు/కరకగూడెం

హజ్‌యాత్రతో పాపాలకు విముక్తి..

ఇస్లాం పంచ సూత్రాలైన ఇమాన్(అల్లాపై విశ్వాసం), నమాజ్(ప్రార్థన), రోజా(ఉపవాసం), జకాత్(దానం), హజ్(మక్కా యాత్ర)లను ఆచరించాలని ముస్లిం మత పెద్దలు చెబుతుంటారు. ఇందులో రోజా, జకాత్ రంజాన్ మాసంలో పాటిస్తారు. హజ్‌ను బక్రీద్ మాసంలో చేస్తుంటారు. పవిత్రంగా భావించే సౌదీ అరేబియాలోని మక్కా, మదీన ప్రాంతాలను ఆర్థిక స్తోమత కల్గిన ముస్లింలు జీవితంతో ఒక్కసారైనా సందర్శించాల్సి ఉంటుంది. అది కూడా కష్టపడి సంపాదించిన సొమ్ముతో. ఎలాంటి స్వార్థపూరిత ఆలోచనలు లేకుండా, రాగద్వేషాలను వదిలేసి మానవతను వ్యాప్తి చేయాలన్నే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం. పండుగ రోజు మక్కా నగరంలోని కాబా మదీన నగరంలోని మహ్మద్ ప్రవక్త సమాధిని దర్శించుకుంటారు. దీనినే హజ్ అంటారు. హజ్ యాత్ర చేస్తే జీవితంలో చేసిన పాపాలన్నీ తొలగిపోతాయని ముస్లింల నమ్మకం. ఖురాన్ ప్రకారం.. భూమిపైకి అల్లా పంపిన ఇబ్రహీం మక్కా పట్టణాన్ని నిర్మించి నివాస యోగ్యంగా మార్చారు. అల్లా ఆరాధన కోసం కాబా అనే ప్రార్థనా మందిరాన్ని సైతం కూడా నిర్మించి దైవ ప్రవక్తగా పేరుపొందాడు. ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ మెడపై కత్తి పెట్టి జబాహ్‌కు ఉద్యుక్తుడవుతుండగా .. అతని త్యాగానికి మెచ్చిన అల్లా ఇస్మాయిల్‌కు బదులుగా ఓ జీవాన్ని బలివ్వాలని జిబ్రాయిల్ అనే దూత ద్వారా కోరతాడు. అప్పటి నుంచి బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందని ముస్లింలు భావిస్తున్నారు.

ఖుర్బానీ పరమార్థం..

ఖుర్బానీ అంటే పేదలకు మాంసాన్ని దానం ఇవ్వడం, త్యాగం, సాన్నిధ్యం, సామీప్యం అనే అర్థాలు ఉన్నాయి. అంటే దైవ సాన్నిధ్యాన్ని పొందడం, దైవానికి సమర్పించడం, దైవం కోసం త్యాగం చేయడం అని భావం. అయితే ఖుర్బానీ ద్వారా రక్త మాంసాలు సమర్పించడం కాదని, అవి అల్లాహ్‌కు చేరవని, భక్తి, పారాయణత హృదయంలో జనించే త్యాగభావం, భయభక్తులు మాత్రమే అల్లాహ్‌కు చేరుతాయని ముస్లింల భావన. బక్రీద్ రోజున నమాజ్ పూర్తయిన పిమ్మట గొర్రెనో, మేకనో, ఆవునో లేక ఒంటెనో బలి ఇవ్వాల్సి ఉంటుంది. దీనినే ఖుర్బానీ అంటారు. ఇలా బలిచ్చిన దానిని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు, రెండో భాగాన్ని బంధువులకు, మూడో భాగాన్ని ఇంట్లోనే వండి స్నేహితులకు, ఆత్మీయులకు విందు ఏర్పాటు చేస్తారు.


కొత్తగూడెంటౌన్: ముస్తాబైన రామవరంలోని జామా మసీదు

కాలాలు మారినా..

కాలాలు మారుతున్నా బక్రీద్ సందర్భంగా ఇచ్చే దానాలు, ప్రవక్త త్యాగనిరతిని గుర్తు చేసుకునే విధానంలో ఎలాంటి మార్పు రావడం లేదు. చరిత్రలో ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతిని గుర్తు చేసుకొని ఇప్పటికీ ముస్లింలు బలిదానాలతో పాటు ఇతర ఆచార, సంప్రదాయాలను కూడా నేటికీ ప్రపంచ వ్యాప్తంగా పాటిస్తుండడం గమనార్హం అందుకే త్యాగం నిరంతరమైనదని, దైవాన్ని మెప్పించేదని ముస్లింలు బలంగా నమ్ముతారు.

ఇస్లాం నియమాలు ఆచరించాలి..



బక్రీద్ రోజు ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. ఇబ్రహీ త్యాగపూరిత జీవితాన్ని ఆదర్శంగాతీసుకుని నిత్యజీవితంలో ప్రతీ ముస్లిం ఆచరించి సమసమాజ స్థాపనకు ప్రేరణ చూపాలి. ఇస్లాంలో ఉన్న ఐదు నియమాలు కచ్చితంగా ఆచరించి సన్మార్గంలో నడవాలి.

– మౌలానా ఖ్వారీ మహమ్మద్ అజామ్, పద్మాపురం మజీద్

ఖుర్బానీ ఆనవాయితీ..



మానవాళిలో ఆవహించి ఉన్న పశుతత్వాన్ని నిర్మూలించి నిష్కలంక హృదయులై సంచరించుట దైవానికి ప్రీతికరమని చెప్పడమే బక్రీద్ అంతర్థారం. నమాజ్ పూర్తయ్యాక పొట్టేలును బలిచ్చి ఆ మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగాన్ని పేదలకు పంచుతాం. అల్లహ్ పంపిన ప్రవక్త త్యాగాలను గుర్తుచేసుకుంటాం.

– ఎండీ సత్తార్ పాషా, జమియా మసీదు రామవరం

త్రికరణ శుద్ధితో ఆచరించాలి..



ఖురాన్‌లో లిఖితమైన నియమాలను ప్రతీ ముస్లిం త్రికరణశుద్ధితో ఆచరించాలి. అప్పుడే మనశ్శాంతి కలుగుతుంది. ఆర్థిక స్తోమత కలిగిన వారు బక్రీద్ పర్వదినాన ఖుర్బానీ తప్పకుండా ఇవ్వాలి. అది కూడా సొంతంగా కష్టపడి సంపాదించిన సొమ్ముతో. హజ్ యాత్రకు ప్రాధాన్యమివ్వాలి.

– ఎండీ ఇరాహిత్, ప్రభుత్వ ఖాజీ, ఇల్లెందు

త్యాగనిరతికి ప్రతీక..



త్యాగనిరతికి ప్రతీక బక్రీద్. అమితంగా ప్రేమించే ధనం, వస్తువులు, ఇష్టపడే ఆహార పదార్థాలను త్యాగం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అన్నింటికంటే ఇతరుల పట్ల ఈర్ష్య, ద్వేషం, చెడు కోరికలను వదిలివేయాలి. త్యాగం నిరంతరమైనది, దైవాన్ని మెప్పించేలా పండుగ జరుపుకుంటాం.

– షేక్ ఆరీఫ్ మౌలీ సాహెబ్, జమా మజీద్, జూలూరుపాడు

హోల్‌సేల్ పేరుతో మోసం చేశారని నిరసన


ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న అరుణ్‌కుమార్

పాల్వంచ: హోల్‌సేల్ పేరుతో సరుకులు ఇస్తామని నమ్మించి లక్షలాది రూపాయలు దండుకుని, అడిగితే దాడులకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ బాధితుడు ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశాడు. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం నేతాజీ మార్కెట్ ఏరియాకు చెందిన గోళ్ల అరుణ్‌కుమార్ వృత్తి రీత్యా హోల్‌సేల్ కిరణా సరుకుల వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఇందిరా కాలనీకి చెందిన పాషా అనే వ్యక్తి హోల్‌సేల్‌గా ఆయిల్, పంచదారా, పప్పుదినుసులు ఇతర సరుకులు తక్కువ ధరకే ఇస్తానని, ఖమ్మంలోని అస్మా, ఆమె భర్త పాషా, బంధువులు ఇదే వ్యాపారం చేస్తారని నమ్మబలికాడని తెలిపారు. దీంతో నమ్మి కొంత వ్యాపారం చేశానని, తర్వాత 2022 సంవత్సరంలో పెద్ద మొత్తంలో రూ.7లక్షలు తీసుకుని అగ్రిమెంట్ చేయించుకుని సరుకులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని వాపోయాడు. ఈ విషయాన్ని అడిగేందుకు పాషా ఇంటికి వెళ్తే ఈనెల 5వ తేదీన తమపై దాడికి పాల్పడ్డారని, దీంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పాడు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తాను అప్పు చేసి వారికి ఇచ్చిననగదును ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఫ్లెక్సీ పట్టుకుని నిరసన చేశాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాఘవయ్య పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి రూరల్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు. ఈ విషయమై రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. కేసు కొత్తగూడెం త్రీటౌన్ పరిధిలోకి వస్తుందని బాధితుడికి తెలిపి అక్కడకు వెళ్లమని సూచించామన్నారు.

పశువుల వాహనం పట్టివేత

ఇల్లెందు: ఆళ్లపల్లి నుంచి మహబూబాబాద్‌కు రెండు పశువులతో వెళ్తున్న ఓ వాహనాన్ని గోవిందొసెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లపల్లి నుంచి రెండిన ఆదాం అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఎల్ల బోయిన నవీన్, కె.బన్నీలతో కలిసి మహబూబా బాద్‌లోని ఫయాం అనే వ్యక్తికి అప్పగించేందుకు ఆదివారం రెండు పశువులను తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో గోవింద్ సెంటర్ వద్దకు రాగానే ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి పట్టుకుని పశువులను గోశాలకు తరలించారు. అతర్వాత ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ..

బూర్గంపాడు: మోరంపల్లిబంజర అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని అటవీశాఖ సిబ్బంది పటుకున్నారు. ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని మోరంపల్లిబంజర వద్ద ఆటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. ఆ లారీని పాల్వంచలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, మోటార్ సైకిల్

బూర్గంపాడు: మణుగూరు క్రాస్‌రోడ్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పాల్వంచ నుంచి భద్రాచలం వస్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న టూవీలర్ వేగంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో మోటార్ సైకిలిస్ట్ తీవ్రగాయాలతో రోడ్డుపై పడిపోగా.. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి కూడా తీవ్రగాయాలయ్యాయి. భద్రాచలానికి సమీపంలోని ఏటపాక మండలం కొత్తూరు నారాయణపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం పాల్వంచలోని ఓ చర్చిలో ప్రార్థనలకు వెళ్లి ఆటోలో తిరుగు పయనంలో ఈ ప్రమాదం జరిగింది. అపస్మారక స్థితిలో ఉన్న మోటార్ సైకిలిస్ట్‌ను, ఆటోలోని ప్రయాణికులను అటుగా వస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తన వాహనంలో, అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, మోటార్ సైకిలిస్ట్ వివరాలు తెలియలేదు.

మరో ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి...

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా గ్రామం వద్ద తల్లాడ– కొత్తగూడెం ప్రధాన రహదారి పై ఆదివారం ఆటో, బైక్ ఢీకొనగా.. ద్విచక్రవాహనదారుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడకు చెందిన ఆటో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తుంది. అదే సమయాన ఏన్కూరు మండలం జన్నారం గ్రామానికి చెందిన మాళోత్ ఉదయ్ సాగర్ అనే వ్యక్తి ఖమ్మం వైపే వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిరాంతండా వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఆటోను బైక్ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు కాగా ఆటో డ్రైవర్ ధర్మయ్యతో పాటు అతడితో పాటు ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా, ఆటో వెనుక భాగం, బైక్ నుజ్జు నుజ్జు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న బ్లూకోట్ కానిస్టేబుల్ వెంకట్ సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. ప్రమాద సంఘటనపై పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

కారు, స్కూటీ ఢీ..

ములకలపల్లి: కారు, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరి వ్యక్తులకు గాయాలయ్యారు. వివరాలిలా.. దమ్మపేట వైపు నుంచి ములకలపల్లి వస్తున్న కారు, పాల్వంచ నుంచి దమ్మపేట వైపు వెళ్తున్న స్కూటీలు మండలపరిధిలోని గంగారం అటవీ ప్రాంతంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను 108లో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నామని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పామాయిల్ తోట దగ్ధం


దగ్ధమైన పామాయిల్ క్షేత్రంలో బాధిత రైతు

దమ్మపేట: విద్యుత్ లైన్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పామాయిల్ తోట దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో చోటు చేసుకుంది. ఆదివారం దమ్మపేట గ్రామ పరిధిలోని అర్బన్ కాలనీ శివారులోని చక్కిరాల లక్ష్మణరావుకు చెందిన మూడు ఎకరాల పామాయిల్ క్షేత్రంలో విద్యుత్ ఎల్‌టీ లైను చెట్లకు తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు చెలరేగి, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోగా, పామాయిల్ చెట్లు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.లక్ష పంట నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

తాటిచెట్టుపై పిడుగు



పాల్వంచరూరల్: మండల పరిధిలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ గంగాదేవిపల్లిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈనేపథ్యాన గ్రామానికి చెందిన వగ్గెల రామారావు ఇంటి సమీపంలో ఉన్న తాటిచెట్టుపై పిడుగుపడి కాలిపోయింది. అంతేకాక పిడుగుపాటుకు గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఆదివాసీ యువతకు స్మగ్లర్ల వల!

- గిరిజన యువకులను గంజాయి దందాలోకి లాగుతున్న వైనం
- అమాయకత్వం, ఆర్థిక అవసరాలను లక్ష్యంగా చేసుకుంటున్న స్మగ్లర్లు



ములకలపల్లి: గంజాయి ఘాటు పట్టణాలు, పబ్ కల్చర్, రేవ్ పార్టీలను దాటి పల్లెలకు పాకుతోంది. ఏజెన్సీలో అమాయకత్వాన్ని, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని స్మగ్లర్లు ఆదివాసీ యువకులను గంజాయి దందాలోకి దింపుతున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా ఏజెన్సీ మండలమైన ములకలపల్లిలో తొలిసారిగా గత శుక్రవారం పోలీసులు 5.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నా.. మండల పరిధిలోని ఓ గిరిజన గ్రామంలో పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఘటనలో గిరిజన యువకుడితోపాటు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

రూటు మార్చుతున్న స్మగ్లర్లు..

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా స్మగ్లర్లు హైదరాబాద్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు నిత్యం గంజాయి తరలిస్తున్నారు. సాధారణంగా భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం ప్రాంతాల మీదుగా స్మగ్లర్లు గంజాయి తరలిస్తుంటారు. ఈ మార్గంలో పోలీసులు గట్టి నిఘా పెట్టడంతో తరచూ పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల కళ్లు గప్పి జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలైన అశ్వారావుపేట, ములకలపల్లి తదితర ప్రాంతాల మీదుగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈజీమనీ ఆశజూపి..

ఈజీమనీ ఆశజూపి ఆదివాసీ యువకులను గంజాయి దందాలోకి దింపుతున్నట్లు తెలుస్తోంది. వారి అమాయకత్వం, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని స్మగ్లర్లు గిరిజన యువకులను ఈ వ్యాపారంలోకి లాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాలో ఆంధ్రాకు సరిహద్దుగా ఉన్న ములకలపల్లికి భారీగా సరుకు చేరుస్తూ, ఇక్కడి నుంచి హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరు గంజాయిని ప్యాకెట్లుగా మార్చి సమీప పట్టణాల్లో విక్రయానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ములకలపల్లి మండలానికి చెందిన మరో మూడు గ్రూపులకు ఈ దందాలో పాత్ర ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని పలు గ్రామాల్లో అనేక మంది యువకులు, మైనర్ బాలురు సైతం గంజాయి వ్యసనానికి అలవాటు పడినట్లు తెలుస్తోంది. పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ఆదిలోనే గంజాయి దందాను నిరోధించాలని, దీని బారి నుంచి ఆదివాసీ యువతను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఎవరినీ ఉపేక్షించేదిలేదు : ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. ములకలపల్లిలో గంజాయి పట్టుబడటంపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఘటనతో సంబంధం ఉన్నవారు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. గంజాయిని అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆదివాసీ యువత ప్రలోభాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఉక్కుపాదం మోపుతాం



మండలంలో గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ నిర్వహిస్తున్నాం. స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపి, గంజాయి రవాణా అరికడతాం.

–రాజమౌళి, ములకలపల్లి ఎస్సై

ఆలోచింపజేసిన కపిరాజు నాటిక


కపిరాజు నాటికలోని దృశ్యం


అన్నాబత్తుల రవీంద్రనాథ్, తూము ప్రకాష్‌రావులకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, అతిథులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రపంచంలో అధర్మం మితిమీరడానికి క్రైమ్ రేట్ పెరగడానికి ప్రధాన కారణం అనుబంధాలు పలుచబడటమేనని, ఇతిహాసాల్లో అనుబంధాలు, ఆత్మీయతల కమ్మదనాన్ని ఆవిష్కరించారనే కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకున్న 'కపిరాజు' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో విజయవాడకు చెందిన న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్స్ ఆర్ట్స్ కళాకారుల బృందం 'కపిరాజు' నాటికను ప్రదర్శించింది. రామాయణం, మహాభారతం కథల్లో అన్నదమ్ముల కథలే విశేషం. రామాయణంలో రామలక్ష్మణులు, రావణ విభీషణులు, వాలి సుగ్రీవులు, రావణ విభీషణుల మధ్య అహంకారం చిచ్చుపెట్టింది. వాలి సుగ్రీవుల మధ్య అధికారం చిచ్చు పెట్టి భ్రష్టులుగా నిలబెట్టింది. కానీ అహంకారాన్ని వదిలి పెట్టిన రామ, లక్ష్మణులను భగవంతులుగా నిలబెట్టింది ధర్మం. అహంకారం, అపార్థం ఎంత పతనం చేస్తుందో రుజువు చేసే కథే 'కపిరాజు' నాటిక. 40 మంది కళాకారులు ప్రదర్శించిన ఈ నాటిక ప్రేక్షకులను ఆద్యంతం ఆలోచింపజేసింది.

కళలు ఆధునికతను అందిపుచ్చుకోవాలి..

– రవిమారుత్, విద్యావేత్త

కళలు ఆధునికతను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని విద్యావేత్త, హార్వెస్ట్ విద్యా సంస్థల అధినేత రవిమారుత్ తెలిపారు. నెలనెలా వెన్నెల కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న రవిమారుత్ మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనగుణంగా కళలు కూడా రూపాంతరం చెందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా తూము ప్రకాష్‌రావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు నీరజ కపిరాజు నాటికకు పారితోషికాన్ని అందించారు. ఇటీవల ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 32 గంటల పాటు గాన లహరి కార్యక్రమాన్ని నిర్వహించి రికార్డు సాధించిన వంజా మాలతీనాయుడును నెలనెలా వెన్నెల నిర్వాహకులు సత్కరించారు. ముందుగా తెలంగాణ తొలితరం ఉద్యమ నేత అన్నాబత్తుల రవీంద్రనాథ్, తూము ప్రకాష్‌రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నెలనెలా వెన్నెల అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ కావ్య, సాయిశ్రీ డెవలపర్స్ అధినేత కమర్తపు శ్రీధర్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సాయిరాం, నామా లక్ష్మీనారాయణ, నందిగామ కృష్ణ, మారుతి కొండల్‌రావు, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


దహన సంస్కారాలు నిర్వహిస్తున్న రాజేశ్వరి

మధిర: మండలంలోని మాటూరుపేట గ్రామంలో దనిశెట్టి అప్పారావు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో మృతుని పెద్దకుమార్తె రాజేశ్వరి దహన సంస్కారాలు నిర్వహించింది. అప్పారావుకు కుమారులు లేరు. ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె తండ్రికి తలకొరివి పెట్టింది. ఫాదర్స్ డే రోజున తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుందని పలువురు చర్చించుకున్నారు.

ఈవీఎంల గుట్టు విప్పేదెవరు?

ఒక్కొక్కటిగా ఈవీఎం అక్రమాలు వెలుగులోకి.. ముంబైలో గెలిచిన శివసేన(షిండే) అభ్యర్థి రవీంద్ర వాయ్‌కర్‌పై దర్యాప్తు

- ఈవీఎంల హ్యాకింగ్ సాధ్యమే.. ఏఐతో హ్యాక్ చేయవచ్చు
- వాటిని రద్దు చేయాలంటూ టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ డిమాండ్
- ఎన్ని ఆరోపణలొస్తున్నా నోరు విప్పని సీఈసీ.. కూటమి నేతలు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎంలు) పనితీరుపై ముసురుకుంటున్న అనుమానాలతో ప్రస్తుతం దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈవీఎంల హ్యాకింగ్ అసాధ్యమేమీ కాదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంతో వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చని టెక్ దిగ్గజం, టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈవీఎంలను మనుషులు కూడా హ్యాక్ చేసేందుకు ఆస్కారం ఉందని, అసలు వీటిని రద్దు చేయాలని చాట్ జీపీటీ నిపుణుడైన ఆయన గట్టిగా డిమాండ్ చేయడం గమనార్హం. మరోవైపు ముంబైలో గెలుపొందిన శివసేన (షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ బంధువు ఒకరు మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేసి ఆపరేట్ చేసినట్లు వెలుగులోకి రావడం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం ఈవీఎంల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఓటింగ్ సరళిపై ఇప్పటికే పలువురు నిపుణులు, పరిశీలకులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా తమ ఓట్లన్నీ ఏమయ్యాయంటూ గ్రామాలకు గ్రామాలే నిలదీస్తుండటం గమనార్హం. గెలుపొందిన అభ్యర్థులు సైతం ఊహించని స్థాయిలో మెజారిటీలు రావటంపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఈవీఎంల పనితీరుపై సర్వత్రా సందేహాలు తలెత్తుతున్నా... తాము వేసిన ఓట్లు ఏమయ్యాయని ఓటర్లు ప్రశ్నిస్తున్నా.. 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయని యావత్ దేశం నిలదీస్తున్నా... కేంద్ర ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించిన అనంతరం అందులో లొసుగులు గుర్తించడంతో వాటిని నిషేధించిన దేశాల సంఖ్య పెరుగుతోంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశాలు సైతం బ్యాలెట్ పేపర్ విధానాన్నే అనుసరిస్తున్న నేపథ్యంలో మన దేశంలో ఈవీఎంలతో ఎన్నికల నిర్వహణ సరికాదని సాధారణ ఓటర్లతోపాటు నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా పరీక్షిస్తే కానీ ఈ రహస్యం వీడదని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

చిప్‌లోనే చిదంబర రహస్యం..!

ఈవీఎంలలో ఉపయోగిస్తున్న చిప్‌లపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిజ్ఞానంపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సూటిగా సమాధానం చెప్పకపోవడం సందేహాలకు బలం చేకూరుస్తోంది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని పలువురు సవాళ్లు విసురుతున్నా ఈసీ ఏమాత్రం పట్టించుకోవట్లేదు. దీనిపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈసీ చేసిన ప్రకటన మరిన్ని సందేహాలకు తావిచ్చింది. ఈవీఎంలలో బ్లూటూత్ టెక్నాలజీ లాంటిది ఉండదు కాబట్టి హ్యాక్ చేయడం సాధ్యం కాదని ఈసీ ఇటీవల వరకు వాదిస్తూ వచ్చింది. అయితే ఈవీఎంలలో ప్రోగ్రామబుల్ చిప్‌లు ఉపయోగిస్తున్నామని, ఫ్లాష్ మెమరీ వాడకం కూడా ఉంటుందని ఈసీ ఇటీవల తొలిసారిగా అంగీకరించింది. ప్రోగ్రామబుల్ చిప్‌లు, ఫ్లాష్ మెమరీని హ్యాక్ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఈవీఎంలు బ్లాక్ బాక్స్‌లు: ట్విట్టర్‌లో రాహుల్‌గాంధీ

ఈవీఎంలు బ్లాక్ బాక్సులు లాంటివి. వాటిని పరిశీలించేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం తీవ్ర ఆందోళనకరం.

భద్రతా సందేహాస్పదమే

ఈవీఎంల భద్రత, నిర్వహణపైనా నీలి నీడలు అలుముకుంటున్నాయి. నిపుణులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు ఈసీ సూటిగా సమాధానాలు చెప్పడం లేదు. ఈవీఎంల నిర్వహణ విషయంలో ఎన్నో భద్రత లోపాలు, ఇతర లొసుగులు ఉన్నట్లు ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైంది. 2017 డిసెంబరు నాటికే ఈవీఎంల చోరీ, ధ్వంసం ఉదంతాలు దాదాపు 70 వరకూ చోటు చేసుకున్నట్లు 'ద వైర్'ప్రచురించిన కథనం స్పష్టం చేసింది. ఉత్తరాఖండ్‌కు చెందిన మాజీ మంత్రి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈసీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈవీఎంలను తయారు చేసే ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రకటన ప్రకారం.. ఈసీఐ కోరిన దాని కంటే 1,97,368 ఈవీఎంలు, 3,55,747 కంట్రోల్ యూనిట్లు ఎక్కువగా తయారయ్యాయి. 2024 ఎన్నికల సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఈవీఎంలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద లభించాయి. ఇక చోరీకి గురైన ఈవీఎంలపై ఈసీ స్పందన విడ్డూరంగా ఉంది. ప్రతి ఈవీఎంకు ప్రత్యేకమైన ఐడీ ఉంటుందని, యంత్రం చోరీకి గురైనా, కనిపించకుండా పోయినా ఆ ఐడీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. తద్వారా ఆ ఈవీఎంలలో నమోదైన ఓట్లు పోలైన ఓట్లలో కలవకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలిపింది. మరి చోరీకి గురైన యంత్రాల్లో పరికరాలను మార్చినా, ఓటింగ్ నమోదు చేసేందుకు వాడిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి ఇతర ఈవీఎంలతో కలిపేస్తే ఏమవుతుంది? అనే ప్రశ్నలకు ఈసీ మౌనం దాల్చడం గమనార్హం.



ఈవీఎంలను నిషేధించాలి: ప్యూర్టోరికోలో ఎన్నికల అక్రమాలపై ఎక్స్‌లో ఎలాన్ మస్క్

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలను నిషేధించాలి. ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణ సరికాదు. వాటిని సులభంగా హ్యాక్ చేయవచ్చు. ఈ భూమ్మీద హ్యాక్ చేయలేనిది ఏదీ లేదు.

మొబైల్‌తో ఈవీఎం హ్యాకింగ్

ఈవీఎంలు ఎంత లోపభూయిష్టమో... వాటిని ఎంత సులువుగా హ్యాక్ చేయవచ్చో బహిర్గతమైంది. ముంబై నుంచి వెలువడే ప్రముఖ దినపత్రిక 'మిడ్ డే'కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని వాయువ్య ముంబై నియోజకవర్గం నుంచి ఎంపీగా కేవలం 48 ఓట్లతో విజయం సాధించిన శివసేన (ఏక్‌నాథ్ షిండే) అభ్యర్థి రవీంద్ర వైకర్ సమీప బంధువు మంగేశ్ పండిల్కర్ తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈ నెల 4న నిర్వహించారు. ఎంపీ బంధువు మంగేశ్ పండిల్కర్ ఈ సందర్భంగా తన మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేశారు. ఓటీపీ జనరేట్ చేయడం ద్వారా ఈవీఎంను అన్‌లాక్ చేయడం గమనార్హం. మొదట్లో శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) అభ్యర్థి అమోల్ సంజన కీర్తికర్ కంటే వెనుకబడిన రవీంద్ర వైకర్ అనూహ్యంగా 48 ఓట్లతో విజయం సాధించడం గమనార్హం. అయితే మొబైల్ ద్వారా ఈవీఎంను హ్యాక్ చేశారన్న మిడ్ డే పత్రిక కథనాన్ని ఈసీ ఖండించింది.

20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయి?

దేశంలో ఏకంగా 20 లక్షల ఈవీఎంలు కనిపించకపోడం మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే ప్రశ్నార్థకంగా మార్చేసింది. ఎన్నికల నిర్వహణ కోసం 60 లక్షల ఈవీఎంలను దిగుమతి చేసుకోగా వాటిలో 40 లక్షల ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియకు కేటాయించినట్టు ఈసీ వెల్లడించింది. మరి మిగిలిన 20 లక్షల ఈవీఎంలు ఎక్కడున్నాయనే ప్రశ్నకు ఇటు ఈసీగానీ అటు కేంద్రంగానీ జవాబు చెప్పడం లేదు. ఆ 20 లక్షల ఈవీఎంలు ఏమయ్యాయో చెప్పాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. దేశంలో ఎంపిక చేసిన రాష్ట్రాలు, నియోజకవర్గాల్లో ఈవీఎంలను మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కమ్యూనిస్టు పార్టీలు ఆరోపిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా విభ్రాంతి వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ, బిజూ జనతాదళ్ పార్టీలు తమకు అత్యంత బలమైన స్థానాల్లో కూడా ఓడిపోవడం విస్మయపరుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీకి ఏమాత్రం బలం లేని నియోజకవర్గాల్లో సైతం ఆ పార్టీల అభ్యర్థులకు అనూహ్య మెజార్టీలు వచ్చాయి. ఒడిశాలో బీజేపీ ఉనికి అంతంత మాత్రంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం గమనార్హం. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు పడ్డ పాట్లన్నీ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి.

జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి?

- రేసులో బుద్ధప్రసాద్, బొలిశెట్టి
- ఈ నెల 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచన

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీకి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి లభించిన విషయం తెలిసిందే. 21 మంది ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని జనసేన ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. దీనికి చంద్రబాబు అంగీకరించినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జనసేనకు మూడో వంతు పదవులు వస్తాయని పవన్‌కళ్యాణ్ చెప్పేవారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ పదవి లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ పదవికి జనసేన పార్టీ నుంచి అవనిగడ్డ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. బుద్ధప్రసాద్ ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి జనసేనలో చేరారు. బొలిశెట్టి తొలినుంచీ జనసేనలోనే ఉన్నారు. నిజంగా అవకాశం వస్తే వీరిద్దరిలో ఒకరు ఆ పదవిలో కూర్చోవడం ఖాయమని చెబుతున్నారు. మరోవైపు స్పీకర్ పదవికి టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడి పేరును పరిశీలిస్తున్నారు. ఇదిలావుండగా ఈ నెల 19వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. తొలిరోజు ప్రొటెం స్పీకర్‌తో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, రెండో రోజు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారని సమాచారం.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకరణ

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా జె.శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) ఎ.వి.ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన అనంతరం సతీమణితో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆయనకు స్వామి విశిష్టతను తెలిపారు. దర్శనం అనంతరం ఈవోని వేద పండితులు ఆశీర్వదించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. దీనికిముందు సంప్రదాయాన్ని అనుసరించి ఈవో తొలిగా వరాహస్వామిని దర్శించుకుని క్యూ కాంప్లెక్స్ మీదుగా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్‌వో నరసింహకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రథమ ధ్యేయం

హైందవుల పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల అని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో మంచి పరిపాలన సాగేలా చర్యలు చేపడుతామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు సంతోషంగా తిరుగు ప్రయాణం అవ్వాలనే ప్రయత్నం చేస్తానన్నారు. ఆగమశాస్త్రం అనుసారం శ్రీవారి కైంకర్యాలు సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. గతంలో అవకతవకలు జరిగి ఉంటే విచారణ చేపడతామన్నారు. అలాంటి చర్యలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం శ్యామలరావు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూలైన్ల వద్ద భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని అధికారులకు సూచించారు.


ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న జే శ్యామలాల్‌రావు

రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలే

స్పష్టం చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సాక్షి, అమరావతి: రుషికొండలో ఉన్నవి ప్రభుత్వ భవనాలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపింది. 'ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులు అవి. అవేమీ ప్రైవేటు ఆస్తులు కావు. అవి ఎవరి సొంతం కూడా కాదు. విశాఖపట్నానికి గత ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఈ భవనాలను నిర్మించారు. వాటిని ఎలా వినియోగించుకోవాలన్నది ప్రభుత్వం ఇష్టం. అలాంటి ప్రభుత్వ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీయించి, వాటికి వక్రీకరణలకు జోడించి బురదజల్లాలని ప్రయత్నించడం వెనుక ఉద్దేశాలేంటో ప్రజలు గమనిస్తున్నారు. 1995 నుంచి కూడా విశాఖపట్నం ఆర్థిక రాజధాని అని చంద్రబాబు ఊదరగొడుతూనే ఉన్నారు. ఇప్పటికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. విశాఖ నగరానికి ఒక ప్రధానమంత్రి వచ్చినా, ఒక రాష్ట్రపతి వచ్చినా, ముఖ్యమంత్రి వెళ్లినా, గవర్నర్‌లాంటి వ్యక్తులు వెళ్లినా వారికి ఆతిథ్యం ఇవ్వడానికి సరైన భవనమే లేదన్న విషయాన్ని గుర్తించండి. రుషికొండ రిసార్ట్స్ భవనాల్లోకి వెళ్లి ఫొటోలు తీసి, పైత్యం ప్రదర్శించడంవల్ల మీకు మానసిక తృప్తి కలుగుతుందేమోగాని, విశాఖపట్నం ప్రజలకు మేలు జరగదు'అని పేర్కొంది.

జిల్లా వార్తలు

ప్రజా సంక్షేమమే లక్ష్యం కావాలి

నాగపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యుగల్ రాయలు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ యుగల్ రాయలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మేధావులు ఆలోచించాలని నాగపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యుగల్ రాయలు అన్నారు. మేధావులు కొందరు రాజకీయ, ఆర్థిక లక్ష్యాలను ఎంచుకుని తమ ఆలోచనలను విక్రయిస్తున్నారని, ఈ క్రమంలోనే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం ఖమ్మం జిల్లా స్థాయి సమావేశం ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యుగల్ రాయలు మాట్లాడుతూ గతంలో మేధావులు, విద్యావంతులు అట్టడుగు వర్గాల ప్రజల గురించి ఆలోచించడమే గాక ప్రభుత్వాల తీరును ప్రశ్నించేవారని, ప్రజలకు మద్దతుగా నిలిచే వారని తెలిపారు. ప్రస్తుతం ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, వారిని భ్రమల్లోకి గురి చేసేందుకు కొందరు తమ మేధా సంపత్తిని ఉపయోగిస్తున్నారని, ఇది సమాజానికి అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. చైతన్య వంతమైన ఆలోచనలతో ప్రజల కోసం ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలి తప్ప పాలకుల ప్రాపకం కోసం తమ ఆలోచనలను అమ్ముకోవద్దని హితవు పలికారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యులు వై.ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కె.శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఉపేంద్రనాథ్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కె.విష్ణుమూర్తి, కార్యవర్గ సభ్యులుగా కోసూరి ప్రసాద్, డాక్టర్ నారాయణ, వెంకటరమణ, అంకిత రవి, బెజ్జంకి ప్రభాకరాచారి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం..

- కొండెక్కిన కూరగాయల ధరలు
- ఉద్యానశాఖ నిర్లక్ష్యం వల్లే తగ్గిన సాగు విస్తీర్ణం
- సామాన్యుల పరిస్థితి దయనీయం..
- ధరలు తగ్గించాలని వేడుకోలు

ఇల్లెందురూరల్/వైరారూరల్ : సుమారుగా రెండు దశాబ్దాల కాలంలో సీజన్ వారీగా కూరగాయలు సాగు చేసే గ్రామాల్లో ఈ ఏడాది కూరగాయల తోటలు కనిపించడం లేదు. గతంలో కూరగాయలు పండించిన రైతులు వరుస నష్టాలను మూటగట్టుకోవడంతో మళ్లీ సాగు చేసే ధైర్యం చేయలేక ఈ ఏడాది కాడి వదిలేశారు. ఈ పరిణామంతో ప్రస్తుతం కూరగాయల ధరలు భారీగా పెరుగుతున్నాయి.

తగ్గిన కూరగాయల సాగు

భద్రాద్రి జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు 12 వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతుంటాయి. కానీ ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. జూన్ నాటికి సాధారణంగా 5 వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యేవి. కానీ ఈ ఏడాది ఉద్యాన శాఖ గణాంకాల ప్రకారం 1,500 నుంచి 2వేల ఎకరాల్లోనే సాగవుతున్నట్లు అంచనా. దీంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా, క్యాబేజీ, బుడంకాయ కిలో రూ.60, గోరుచిక్కుడు, దొండకాయి, చామగడ్డ రూ.80, బీరకాయ, కాకరకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాప్సికమ్, చిక్కుడు రూ.100, దోసకాయ రూ.50, సొరకాయ రూ.40, వంకాయ, బెండకాయ రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.


కూరగాయల దుకాణం (ఫైల్)

స్థానికంగా పండి ఉంటే..

ప్రస్తుతం కూరగాయల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గినప్పటికీ ఇల్లెందు, గుండాల మండలాల పరిధిలో తక్కువ విస్తీర్ణంలో బెండకాయ, వంకాయ సాగు చేస్తున్నారు. దీంతో వాటి ధర మార్కెట్‌లో కొంత తక్కువగా ఉంటోంది. ఉమ్మడి జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కూరగాయలు ఉత్పత్తి చేసేలా రైతులను ప్రోత్సహించేవారు కరువయ్యారు. కూరగాయల పంటలు అధిక విస్తీర్ణంలో సాగయ్యే ప్రాంతాల్లో ఉద్యానశాఖ అధికారులు పర్యటించి చీడపీడల నివారణ, వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించే నాథుడే లేరు. ఇక కూరగాయలు పండించినా నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు లేవు. దీంతో విక్రయించగా మిగిలిన కూరగాయలు కుళ్లిపోయి రైతులకు నష్టాలు వస్తున్నాయి.

కూరగాయలు కిలో	ధర (రూ.లలో)
క్యాప్సికమ్	80
బీన్స్	200
టమాట	60
పచ్చిమిర్చి	80
ఆలుగడ్డ	50
దొండకాయ	50
క్యారెట్	80
ముల్లంగి	200
బీట్‌రూట్	80
వంకాయ	40
కొత్తిమీర కట్ట	50
బీరకాయ	100
ములక్కాయ	80
సొరకాయ	40

ఏం కొంటాం.. ఏం తింటాం



రూ.100 తీసుకుని మార్కెట్‌కు వెళితే సంచి సగానికి కూడా కూరగాయలు రావడం లేదు. ఇతర వస్తువుల ధరలన్నీ కూడా మండిపోతున్నాయి. కూరగాయలకూ మినహాయింపు కాదు. ఇలాగైతే ఏం కొంటాం.. ఏం తింటాం.. పప్పుల ధరలు కూడా పెరిగాయి.

– బొమ్మ మాధవి, 21పిట్ ఏరియా, ఇల్లెందు

ధరలు చూస్తే భయమేస్తోంది..



కూరగాయలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు సైతం రోజు రోజుకూ పెరుగుతున్నాయి. కూరగాయలు, బియ్యం, కందిపప్పు వంటి వస్తువులు అందుబాటులో ఉండడం లేదు. రోజు కూలితో వచ్చే డబ్బులు ఇంటి ఖర్చులకే సరిపోవడం లేదు. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోంది.

– బాణాల నాగమణి, లింగన్నపాలెం

సాగు విస్తీర్ణం తగ్గిపోయింది



జిల్లాలో జూన్ నాటికి సుమారు 5వేల ఎకరాల్లో కూరగాయల సాగు ప్రారంభం కావాలి. కానీ ఇప్పటివరకు 1,500 నుంచి 2వేల ఎకరాలకు మించలేదు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి కూరగాయల సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహిస్తాం. నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తాం.

–సూర్యనారాయణ, ఉద్యానశాఖ అధికారి, భద్రాద్రి జిల్లా

పాత యంత్రాలతో సతమతం..

- మూడేళ్లుగా ఖరీదు చేయని యాజమాన్యం
- ఓపెన్ కాస్ట్‌లపై ఆసక్తి చూపుతున్న అధికారులు
- భూగర్భ గనులతో నష్టం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని 11 ఏరియాల్లో 22 భూగర్భ గనుల్లో పాత యంత్రాలతో కార్మికులు సతమతమవుతున్నారు. మూడేళ్లుగా యాజమాన్యం కొత్త ఎల్‌హెచ్‌డీ (లోడ్ హాల్ డంపర్)లు కొనుగోలు చేయని కారణంగా పాత యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో యాజమాన్యం ఓపెన్ కాస్ట్‌లపై ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. సింగరేణివ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో మూడు గనులు (కొత్తగూడెం ఏరియాలోని పీవీకే-5 ఇంక్లైన్, జీడీకేలోని వకీల్‌పల్లి, జీడీకే-11 ఇంక్లైన్) ఎల్‌హెచ్‌డీలతో ఉత్పత్తి చేస్తుండగా, మిగతా 19 గనుల్లో సైడ్ డంప్ లోడర్ (ఎస్‌డీఎల్)లతో ఉత్పత్తి చేస్తున్నారు. సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల లక్ష్యాలను సాధించింది. వీటిలో సింగరేణివ్యాప్త 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న 8 వేల మంది 64 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా, 22 భూగర్భ గనుల్లో సుమారు 20 వేల మంది పనిచేస్తూ ఎల్‌హెచ్‌డీ, ఎస్‌డీఎల్‌ల ద్వారా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించారు. సింగరేణి భూగర్భ గనుల్లో ఎల్‌హెచ్‌డీలు రోజుకు 16 గంటలు పనిచేస్తే ఏడాదికి ఒక్కొక్క సుమారు 75 వేల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ, రోజుకు 8/9 గంటలు మాత్రమే పని చేస్తూ 40 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే చేస్తున్నారు. ఎస్‌డీఎల్ ద్వారా ఏడాదికి 40 వేల టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 25/30 వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.


ఎల్‌హెచ్‌డీ యంత్రం

గనుల్లో ఫ్లాటర్ గ్రేడియంట్ 1:6 ఉండాలి..

సింగరేణిలో కొన్ని గనుల్లో గ్రేడియంట్ 1:6 ఉంటేనే ఎల్‌హెచ్‌డీలు నడుస్తాయని, లేకపోతే వాటి టైర్లు బర్స్ట్ అయ్యే ప్రమాదం ఉంటుందని, ఎస్‌డీఎల్ చైన్ సిస్టమ్ ఉండటం మూలంగా గనుల్లో నేల ఎలా ఉన్నా నడుస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎల్‌హెచ్‌డీ ఖరీదు రూ.కోటి ఉండగా, ఎస్‌డీఎల్ రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. హెచ్‌డీఎల్ 9 ఏళ్లు పనిచేస్తాయని, ఎస్‌డీఎల్ మాత్రం 6 నుంచి 8 ఏళ్లు మాత్రమే నడుస్తాయని, కొందరు అధికారుల పర్యవేక్షణ లోపం, కార్మికుల నిర్లక్ష్యంతో అవి అనతికాలంలోనే దెబ్బతింటున్నాయని తెలుస్తోంది. కాగా, గనుల్లో కార్మికులు పనిచేయటానికి సుముఖంగా లేరని, యంత్రాల ఖరీదు, ఉద్యోగుల వేతనాలు, నిర్వహణ ఖర్చు కలిపితే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేసి అమ్మితే సుమారు రూ.4 వేలకు పైగా నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఉత్పత్తిపై ఆసక్తి చూపిస్తోందని సమాచారం.

కిన్నెరసానికి పర్యాటకుల రద్దీ

ఒకరోజు ఆదాయం రూ.39,780

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చిన పర్యాటకులు డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 647 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,410 ఆదాయం లభించగా, 290 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.17,370 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

'అరుంధతీరాయ్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి తగదు'

టేకులపల్లి : ప్రముఖ రచయిత అరుధంతీరాయ్‌ని ఉపా చట్టం కింద ప్రాసిక్యూట్ చేసేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి ఇవ్వడం సరైంది కాదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 ఏళ్ల క్రితం నాటి కేసులో ఇలా చేయడం దురుద్దేశ చర్యేనని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం గొంతెత్తే వారిని అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రముఖ విద్యావేత్త షేక్ షౌకత్ హుస్సేన్ ప్రాసిక్యూషన్‌కు కూడా అనుమతి ఇవ్వడం శోచనీయమని పేర్కొన్నారు.

గిరిజనాభివృద్ధికి కృషి చేశా

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులకు చేతనైనంత వరకు సహాయ సహకారాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేశానని బదిలీపై వెళ్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీ ఉత్తర్వులు రాగానే ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓగా పనిచేసిన 11 నెలల కాలంలో గిరిజనులకు సేవ చేసే భాగ్యం కలిగిందని, శక్తి మేర గిరిజన సంక్షేమానికి ముఖ్యంగా విద్య, వైద్యంతో పాటు గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, అటవీ హక్కు పట్టాలు, ట్రైకార్ రుణాలు, గిరిజన రైతులకు విద్యుత్ మోటార్ సౌకర్యం వంటి అనేక సేవలు అందించానని వివరించారు. అర్హులైన గిరిజనులందరికీ ఐటీడీఏ ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. గోదావరి వరదల సమయంలో వరద తాకిడికి గురయ్యే ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పాలకవర్గ సమావేశం, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. గిరిజన సంక్షేమానికి ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయని, అందుకోసం ఏదో ఒక రోజు మళ్లీ వస్తానని అన్నారు. విధి నిర్వహణలో ఇంతకాలం తనకు సహకరించిన యూనిట్ అధికారులకు, సిబ్బందికి పీఓ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఐటీడీఏ యూనిట్ అధికారులు సిబ్బంది ప్రతీక్ జైన్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, సురేష్ బాబు, శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశ్వరరాజు, రమణయ్య, నరసింహారావు, హరికృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.


ప్రతీక్ జైన్‌ను సత్కరిస్తున్న ఐటీడీఏ యూనిట్ అధికారులు